49

# బియ్యం

‘ఒసే రంగీ! బుడ్డాడిందాకట్నించీ అట్టా ఏడుత్తాంటే సూత్తా వూరుకుంటా వేంటే! అడ్డమేసుకుని కాసిని పాలియ్య కూడదు?’

“యాడుండయ్ పాలియ్యటానికి? పొద్దుట్నించీ పీకి పీకి నాపానం తీసేత్తన్నాడు సచ్చినోడు! నా కడుపు నిండందే ఆడి కడుపెట్టా నిండుద్ది! యాణ్ణించి ఊరుకొత్తయ్ పాలు? రొమ్ములు సూడు ఎట్టా ఎండిపోయినియ్యో!”

“ఎండిపోక ఒకనాడు సరిగ్గా వుండేడిసి నయ్యంటలే, కాత్తి బువ్వన్నా కలిపి పెట్టకపోయా...”

“ఏమీ ఎరగనట్టు అట్టా అడుగుతా వేం? బువ్వే దుంది? బువ్వొండటానికి బియ్య మేదుండయ్, నిన్న అయిపోతే!”

“ఇయ్యాల కూలికెల్లావుగా! కూలి డబ్బు లేం జేశా!”

“మూటగట్టి దాసుకున్నా! కూలిడబ్బులు యాడుండయ్? ఆ సచ్చి నోడిచ్చి సావలా, ఇయ్యాల సుక్కురోరం,

ఇయ్యాలనత్తే యివ్వను. రేపొద్దున్నే వచ్చి తీసుకో మన్నాడు...!"

"మరెట్టా? పిల్లలకేం బెట్టా?"

"ఏం బెడతాను నా బొంద?...ఏముందని పెట్టను? బువ్వ బువ్వ అని ఏడిసేడిసి ఉక్కాడే పడుకున్నారు. సివరికి గంజి నీళ్ళుకూడా లేవు ఎంకిసడిగాను. లచ్చిసడిగాను... ఎవరిదగ్గరా గింజల్లేవు...నువ్వు బియ్యం తెత్తావని నేను కూకుంటే, నన్నొచ్చి ఈ పెశ్నలన్నీ అడుగుతావేంటి?... నువ్వెందుకు తేలా బియ్యం?"

"ఒసే...! నీయవ్వా...! నేనేడ నుంచి తేనే బియ్యం? కామందియ్యాల్సిన బత్తాలన్నీ తెచ్చుకుతింటిమి. పైగా రొండుసార్లు రొండిరసలు తెచ్చుకు తింటిమి ... ఇంకెక్కణ్నించి వత్తాయే బియ్యం?"

"ఏటిపోడుగుతా ఎద్దల్లే శాకిరీ శేత్తన్నావ్. ఆ ఎదవ సచ్చినోడుంకో రెండు బత్తాల గింజలెక్కువియ్యలేడూ! ఆడికేం రోగమా యియ్యలేక? అయినా నీ దగ్గర నరుకులేంది ఆడుమట్టుకా ఎట్టా యిత్తాడులే! నామీద యిరుసుకు పడ్డమేగాని కామందు నెప్పుడైనా కచ్చితంగా అడిగి తేగా? మొగతనం పెళ్ళాంముందేగాని, ఆడిముందు ఆడదానికంటే కనాకట్టమైపోతే ఆడెందుకిత్తాడు?"

"ఒసే? నోటికొచ్చినట్టల్లా వాగావంటే నరికి పోగులెడతా నాయాల!"

"నరుకు...నరికితే ఒక్కనాటితో పీడిరగడైపోద్ది! నన్నొక్కదాన్నేగాదు. పిల్లల్నికూడా పీక పిసికి సంపు...

గిద్దెడు బియ్యం తేలేనోడికి పెళ్ళామెందుకు? బిడ్డలెందుకు? సంపు అందర్నీ సంపెయ్!"

"అదీ మళ్లీ షోకాలు మొదలెట్నా? నీబతుకంతా ఏడుపే గదే. సాల్లే, ఇక సరిపెట్టు. ఏంజేత్తాను. సావుకారు దగ్గిరికెళ్ళి బియ్యమట్టు కొత్తాలే యాడవమాక. పొయ్యోలి గిచ్చి వుంచు. పొయ్యిలోకి వుల్లలన్నా వుండయ్యా, అయ్యా లేవా?"

"వుల్లల్లేకేం, వుల్లలుండయ్ లే! సన్నా తగలెయ్యి దానికి సరిపడా వుండయ్! బేగెల్లిరా! మళ్లీ పిల్లల్లేత్తే ఏడుత్తారు."

కామందు బియ్యా మివ్వలేదు. ఈ కరువురోజుల్లో బియ్యా మొక్కడి వన్నాడు. బియ్యం తింటానికి నువ్వేం జమీందారువా, మహారాజువా అన్నాడు. ఒక్కపూట కూడు లేకపోతే చావరు లెమ్మన్నాడు మీకు కడుపునిండా కూడుంటే యింకెవర్నీ బతకనివ్వరన్నాడు!

పాలేరు ఏమీ అనలేకపోయాడు.

పాలేరు పసికొడుకు, ఎండిపోయిన తల్లిరొమ్ములు పీకుతూనే వున్నాడు.

పిడకలూ వుల్లలూ కూరి పాలేరు పెళ్ళాం వెలిగించిన పొయ్యి రగులుతోంది. మరి కాసేపటిలో మండుతుం

——